తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శనివారం 12 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 5

# ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌రెడ్డి

## నియమించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి



❖ **తన నియామకం కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రశాంత్‌రెడ్డి**

ప్రజావారధి/మోత్కూరు

యాదాద్రి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన బండారు ప్రశాంత్‌రెడ్డి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవెల్లి వెంకటస్వామి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి నాయకునిగా సుమారు 12 ఏళ్లుగా ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో పని చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలపై, గత ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ఆయన పార్టీ తరపున చురుకుగా పనిచేశారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా విద్యార్థి నాయకునిగా పార్టీలో కష్టపడి పనిచేస్తూ మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పని చేసి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా కూడా పని చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడి, మాజీ హోంమంత్రి మహ్మద్‌అలీ ఇంటి ముట్టడి, సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో మాజీ మంత్రి మల్లారెడ్డి చేసిన అసభ్య వ్యాఖ్యలకు నిరసనగా అర్ధరాత్రి మల్లారెడ్డి ఇంటి ముట్టడి లాంటి తదితర ఎన్నో పార్టీ పిలుపుమేరకు చేసిన కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేశారు. కాలేజీలు, పలు యూనివర్సిటీల్లో ఎన్ఎస్‌యూఐ బలోపేతం కోసం కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ బలోపేతం కోసం పనిచేస్తున్న ప్రశాంత్‌రెడ్డిని గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తనను గుర్తించి నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి, తన నియామకం కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఎస్‌యూఐని మరింతగా బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేస్తానన్నారు.



# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో నివసిస్తున్న గంగిరెడ్డి వెంకట్ రెడ్డి (65) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ఇటీవలే మోత్కూరు వచ్చారు. శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు ట్రాన్స్‌కో ఏఈగా, చిన్న కొడుకు ఎస్ఐగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం కోసం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకట్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు.



# మట్టి విగ్రహాలనే పూజించాలి

**పాలడుగు స్కూల్‌లో మట్టి వినాయక విగ్రహాల తయారీపై అవగాహన**

**ప్రజావారధి/మోత్కూరు**

పర్యావరణ పరిరక్షణతో పాటు నీరు కలుషితం కాకుండా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని హెచ్ఎం వెంకటగిరి అన్నారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం మట్టి వినాయక విగ్రహాల తయారీపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మట్టితో వివిధ ఆకృతుల్లో వినాయకులను తయారు చేసి ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటగిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకుంటే భవిష్యత్ తరాల మనుగడకు ఎంతో ఉపయోగపడతారన్నారు. పర్యావరణాన్ని కాపాడటమంటే దేవుళ్లను పూజించడంతో సమానమని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాలతో పర్యావరణానికి ఎంతో ముప్పు వాటిల్లుతుందన్నారు. విద్యార్థుల్లో అవగాహన పెరగడానికి మట్టి వినాయక విగ్రహాల తయారీ లాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, స్వాతి, ప్రశాంతి, విజయ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ నల్లగొండ డిప్యూటీ ఆర్ఎం నర్సింహకు సన్మానం



**ప్రజావారధి/నల్లగొండ**

ఆర్టీసీ నల్లగొండ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టిన నర్సింహను శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-డి పాస్ట్ జోన్ చైర్ పర్సన్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ సీనియర్ జర్నలిస్ట్ బుడిగె శ్రీనివాసులు డిప్యూటీ ఆర్ఎం నర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

## ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులైన..

# ప్రశాంత్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజావారధి/మోత్కూరు**

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులైన మోత్కూరుకు చెందిన బండారు ప్రశాంత్‌రెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్‌లో విద్యార్థి నాయకునిగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులు కావడం పట్ల శుభాకాంక్షలు చెప్పారు. తనకు అన్ని విధాలుగా అండగా నిలిచి, తన నియామకం కోసం కృషి చేసిన నాయకులందరికీ ప్రశాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్, మెంట రమణనాగేష్, మార్కెట్ డైరెక్టర్ ఎండి.సమీరుద్దీన్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బుశిపాక రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరసానిపల్లి సందీప్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్ కుమార్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీను, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అవిశెట్టి మధు, నాయకులు చేతరాశి వీరస్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మెంట సురేష్, ఆలకుంట్ల శ్రీను, బీసు రాహుల్, బుశిపాక నరేష్, బొల్లెపల్లి శ్రావణ్, అన్నెపు సురేష్, బుర్ర శ్యాంప్రసాద్, బుశిపాక రాంబాబు, దొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# గురజాలలో గ్రామసభ

## ఆదాయ, వ్యయాలు వెల్లడించిన సర్పంచ్ రోజా

**ప్రజావారధి/శాలిగౌరారం**

శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలో శుక్రవారం సర్పంచ్ ఎర్ర రోజాసుధాకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్పంచ్ ప్రజలకు వివరించారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుండి ఇప్పటి వరకు జరిగిన ఆదాయ, వ్యయాల వివరాలను గ్రామసభలో వెల్లడించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజల నుండి వినతులను, సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారంపై చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని, అన్నివిధాలా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా పని చేస్తానన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గందమళ్ల వెంకన్న, ఉప సర్పంచ్ ముత్యాల ఉపేందర్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
12 - 09 - 2026

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘం ఫిర్యాదు



**ప్రజావారధి/మోత్కూరు**

రెడ్డి కులస్తులను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం మోత్కూరు మండల అధ్యక్షుడు లింగాల జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం మోత్కూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్సీగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కులాలు, వర్గాల మధ్య విద్వేషాలు పెంచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రెడ్లపై అనవసర వ్యాఖ్యలతో రెచ్చగొట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పైళ్ల సోమిరెడ్డి, ముప్ప వెంకట్ రెడ్డి, బద్దం రామనర్సింహారెడ్డి, సోలిపురం చంద్రారెడ్డి, వేమన్‌రెడ్డి, ఎ.వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సోమిరెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాలిగౌరారంలో కాంగ్రెస్ నిరసన

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో ఆందోళన




**ప్రజావారధి/శాలిగౌరారం**

అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరును నిరసిస్తూ శాలిగౌరారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత ధనంజయ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధనంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుండి శాశ్వతంగా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మహిళా అధికారులపై దాడులకు పాల్పడటం, ఎర్రవెల్లిలో దళితులు వచ్చారని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అనడానికి నిదర్శనమని మండిపడ్డారు. ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దొర అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని, దళిత స్పీకర్ ను అవమానించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, సర్పంచులు నరిగె యాదయ్య, కట్టగూరి సురేందర్ రెడ్డి, వంగూరి కవిత వెంకన్న, సుంచు నర్సింహ, మాజీ సర్పంచులు బొమ్మగాని రవి, భూపతి వెంకన్న, షేక్ ఇంతియాజ్, మాదగోని అంజయ్య, నోముల జనార్దన్, మంగదుడ్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్, వడ్లకొండ పరమేష్, పెరుమాండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

# శాలిగౌరారం మత్స్య సొసైటీపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం



**నల్లగొండ మత్స్యశాఖ ఆఫీస్ ఎదుట శాలిగౌరారం సొసైటీ సభ్యుల నిరసన**

ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మత్స్య సహకార సొసైటీ నూతన కమిటీపై కొంతమంది కావాలనే అసత్య ఆరోపణలు చేస్తూ ప్రతిష్ట దెబ్బతీస్తున్నారని, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని సొసైటీ నూతన కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నల్లగొండ మత్స్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వెంపటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి పడాల సైదులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం ఏర్పడిన తమ నూతన కమిటీ 708 మంది సభ్యుల నిర్ణయాలకు అనుగుణంగానే కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. బీజేపీ నాయకుడు ఎల్వి.రమణ ముదిరాజ్‌తో పాటు మరికొందరు కలిసి కమిటీపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రతిష్ట దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సొసైటీలో గంగపుత్రులు, ముదిరాజులు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నామని, అనవసర వివాదాలు సృష్టించవద్దని సూచించారు. సొసైటీలో ఎలాంటి అక్రమాలు జరిగినా అధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయించుకోవచ్చని, తప్పు రుజువైతే తమపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అధికారులు పరిశీలన జరిపి ఎలాంటి అక్రమాలు జరగలేదని తేల్చారని పేర్కొన్నారు. ఇకపై నిరాధార ఆరోపణలు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బొల్లేపల్లి నాగరాజు, డైరెక్టర్లు తెడ్ల భిక్షం, వెంపటి మైసయ్య, వెంపటి సైదులు, బాకీ దానయ్య, చింతకాయల అంజయ్యతో పాటు సుమారు 200 మంది సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.